క్లుప్తంగా

ధనుర్మాస పూజలు ప్రారంభం



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని వైష్ణవ ఆలయాల్లో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, ఐదు లాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఆదివారం వైభవంగా పూజలు నిర్వహించారు. స్వామి వారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా రాహు-కేతు పూజలు



నకరికల్లు: దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసిన అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో రాహు-కేతుపూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని రాహు-కేతువులు పల్నాడులోనే ప్రసిద్ధి. దీంతో పలు గ్రామాల నుంచి భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

శరణుఘోషతో ప్రతిధ్వనించిన అమరారామం



అమరావతి: ప్రఖ్యాత శైవ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరుని సన్నిధిలో ఆదివారం అయ్యప్ప పడిపూజ, అభిషేక మహోత్సవాలు అమరావతి అయ్యప్ప భక్తసమాజం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని దాతల సహాయ సహకారాలతో అమరేశ్వరాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో స్వామి వారికి బాబావరప్రసాద్ గురుస్వామి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి జలాభిషేకం, క్షీరాభిషేకం ఇలా పద్దెనిమిది రకాల పండ్ల రసాలతో అభిషేకాలు కనులవిందుగా నిర్వహించారు.

అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరారామం అయ్యప్ప స్వాముల శరణుఘోషతో ప్రతిధ్వనించింది. రేపల్లె వెంకటస్వామికి చెందిన వరసిద్ధి వినాయక అయ్యప్ప భజన బృందం ఆలపించిన అయ్యప్ప గీతాలు భక్తిపారవశ్యంలో ఓలలాడించాయి. పడిపూజ, భజనానంతరం అయ్యప్ప భక్తసమాజం మాలధారులకు భిక్షను ఏర్పాటు చేసారు.

ధనుర్మాసం సందర్భంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

మాచర్ల: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు శ్రవణానక్షత్రం పురస్కరించుకొని పుష్పయాగం నిర్వహించారు. కల్యాణ నిర్వహణ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య, సభ్యులు కొత్తమాసు బ్రహ్మారావు, కజ్జం గురవయ్య, సూరే యలమంద, భవనాసి రామ్మూర్తి, గౌరు సుబ్బారావు, తొండపు శ్రీనివాసరావు, పోలిశెట్టి లింగేశ్వరరావు, పోలిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు పూజా కార్యక్రమాలు జరిపారు. పుష్పయాగం అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 3వేల మందికి అన్నదానం జరిపారు. కార్యక్రమంలో అర్చకులతో పాటు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.వీరాంజనేయరెడ్డి, కౌన్సిలర్ గట్ల కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

మొసలి ఉన్నది.. జాగ్రత్త..



గురజాల : నగర పంచాయతీలోని లక్ష్మీటాకీస్ సెంటర్ వద్ద గల హద్దులకుంట వద్ద మొసలి సంచరిస్తున్న విషయం విదితమే. విషయం తెలుసుకున్న నగర పంచాయతీ, ఫారెస్టు అధికారులు ఆ ప్రాంతంలో నాలుగు వైపులా మొసలి సంచరిస్తుంది జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హద్దులకుంటను దైద ఫారెస్టు బీట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ బి.మోహన్ శ్రీనివాస్‌లు పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు తెలిపారు.

స్పందిస్తే.. మీరూ ప్రాణదాతలే

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ముప్పాళ్ళ, రాజుపాలెం మండల నాయకులతో సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమే.. సమాజంలో రక్త దాతలు అనేక మందికి ప్రాణం పోస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. క్షతగాత్రులు, గర్భిణులు, వ్యాధులతో బాధపడేవారు, ఆపదలో ఉన్న రోగులకు రక్తం దానం చేయడం ద్వారా మరో జన్మ ప్రసాదిస్తున్నారు. స్పందిస్తే.. మీరూ ప్రాణదాతలేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ముప్పాళ్ళ, రాజుపాలెం మండలం వైఎస్సార్ సీపీ నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 51వ జన్మదినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది కంటే ఎక్కువ మంది రక్తదానం చేసేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చాలామంది చదువుకున్న వారు కూడా రక్తదానానికి ముందుకు రావడం లేదని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. 18 నుంచి 65 సంవత్సరాలు వయసు ఉన్న ఆరోగ్యవంతులు అందరూ రక్తదానం చేయవచ్చునన్నారు. వాస్తవానికి ప్రతి మూడు నెలలకు రక్తం ఇవ్వడం మంచిదన్నారు. ఒక వ్యక్తి జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానంతో ముగ్గురిని కాపాడవచ్చునన్నారు. రక్తదానం చేసినప్పుడు ఏర్పడిన నష్టం నాలుగు నుంచి 8 రోజుల్లో భర్తీ అవుతుందన్నారు. ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా 5 వేల మంది రక్తదానం చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ముప్పాళ్ళ మండలం నుంచి వెయ్యి మంది, రాజుపాలెం మండలం నుంచి వెయ్యి మందికి తగ్గకుండా రక్తదానం చేసేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. సమష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు, సత్తెనపల్లి, ముప్పాళ్ళ మండల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, నక్క శ్రీను, నాయకులు మర్రి సుబ్బారెడ్డి, తేలుకుట్ల చంద్రమౌళి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంజేఆర్ లింగారెడ్డి, సిరిగిరి గోపాలరావు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, సాయిరెడ్డి, కళ్ళం అంజిరెడ్డి, అచ్యుత శివప్రసాద్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల బాధ్యులు, నాయకులు, తదితరులున్నారు.

తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
నరుకుళ్లపాడులో సబ్సిడీ విత్తనాల పంపిణీ



నరుకుళ్లపాడులో రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మండల పరిధిలోని నరుకుళ్లపాడు పీఏసీఎస్‌లో మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై వ్యవసాయ శాఖ ద్వారా శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అమరావతి మండలంలో మొత్తం 1025 క్వింటాళ్ల శనగ విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. మిచాంగ్ తుపాను వల్ల అమరావతి మండలంలో మొత్తం 3,182 ఎకరాల్లో పంట నష్టం వల్ల 1,208 మంది రైతులు నష్టపోయారన్నారు. రైతులను ఆదుకునేందుకే సబ్సిడీపై విత్తనాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ సబ్సిడీని వినియోగించుకొని రైతులు మళ్లీ పంటలు వేసి లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, ఏవో అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిలకా సాంబయ్య, నిమ్మా విజయసాగర్‌బాబు, నల్లిబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కంచేటి సాయిబాబుకు వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హతలేదు



క్రోసూరు: వైఎస్సార్‌సీపీలో సస్పెండ్ కాబడి తెలుగుదేశం పార్టీలో చేరిన కంచేటి సాయిబాబుకు వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత లేదని జెడ్పీటీసీ షేక్ జమీలాగపూర్ అన్నారు. ఆదివారం క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్నపుడు కంచేటి సాయిబాబుపై పోలీసుస్టేషన్లో పలు కేసులతోపాటు రౌడీషీటు కూడా నమోదు చేయటం జరిగిందని తెలిపారు. టీడీపీలో చేరిన నీకు రాత్రిపగలు ప్రజలకోసం నియోజకవర్గంలో శ్రమిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావును విమర్శించే స్థాయి లేదన్నారు. నీకు, తెలుగుదేశంపార్టీకి బుద్ధి చెప్పే రోజులు త్వరలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, గొర్రెపాటి రాజు, విప్పల రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి



బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

సత్తెనపల్లి: మండలంలోని అబ్బూరు గ్రామంలో లక్ష్మీనారాయణ స్వామి వారి వార్షిక త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, తీర్థం బిందె తెచ్చుట, విశేష ప్రాతఃకాలర్చనం, మామిడి తోరణాలు కట్టుట, పెండ్లి కుమారుని, పెండ్లి కుమార్తెలను చేయుట, మూలమూర్తికి సర్వాంగ రజిత కవచధారణ, విశేష పూజ, తులసి పూజ నిర్వహించారు. అలాగే సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అఖండ స్థాపనం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, హోమ కార్యక్రమం, భేరీ పూజ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, సంతానము లేని వారికి గరుడ ప్రసాద వితరణ చేపట్టారు. మొత్తం మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్ మాత పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తుల మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీస్తు జీవితమే ఒక సందేశం

అడిషనల్ ఎస్పీ
మాతంగి అశోక్ కుమార్



పరివర్తనలో కేక్‌కట్ చేస్తున్న అడిషనల్ ఎస్పీ అశోక్ కుమార్, అరుణ్‌కుమార్, తదితరులు

సత్తెనపల్లి: మానవజాతికి ప్రేమ మార్గాన్ని చూపడానికే జీసస్ అవతరించాడని, ఆయన జీవితమే ప్రపంచ శాంతికి ఒక సందేశం అని అడిషనల్ ఎస్పీ మాతంగి అశోక్ కుమార్ అన్నారు. మాల మహానాడు సత్తెనపల్లి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పరివర్తన పాఠశాలలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణకుమార్ మాట్లాడుతూ క్రీస్తు యొక్క జననం మానవాళి మనుగడకు స్ఫూర్తిదాయకమన్నారు. ముందుగా సభా పరిచయం మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం చేపట్టగా, సభాధ్యక్షులుగా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేబీఆర్‌జే ప్రసాద్ వ్యవహరించారు. సీయోన్ లూథరన్ దేవాలయం సంఘ కాపరి రెవ పి.స్వరూపకుమార్, రెవ. జి.దయానందంలు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సీఐ పీ ప్రేమయ్య, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోదాజాన్ పాల్, జలవనరుల శాఖ ఏఈ దూమాల సుందరరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ధారా హేమప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్‌బాబు, ఉద్యోగ సంఘాల ప్రెసిడెంట్ మాలే మరియదాసు, బిల్లా మేరీ, మాల మహానాడు నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మాలే కిరణ్ కుమార్, న్యాయవాదులు కాశిమాల మార్క్, చిన్నం మణిబాబు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిర అక్షింతల కలశం శోభాయాత్ర



అచ్చంపేటలో అయోధ్య రామ మందిర అక్షింతల గ్రామోత్సవం

అచ్చంపేట(పెదకూరపాడు) : అయోధ్యలో రామ మందిరం జనవరి 22వ తేదీన ప్రారంభం సందర్భంగా దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు చేరాలన్న సంకల్పంతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన అక్షింతల కలశంకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో అంక్షితలకు స్వాగతం పలికారు. స్థానిక రామాలయం నుంచి అయోధ్య బాలరాముని పవిత్ర అక్షింతల కలశాన్ని గ్రామ పురవీధులలో శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ మండల ప్రఖండ జలసూత్రపు తిరుపతి స్వామి పర్యవేక్షణలో, పెదకూరపాడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ తమ్మా వెంగళరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సూరె వేంకట కోటిలింగం, పసుమర్తి నీలకంఠేశ్వరరావు, కోడ్డిశెట్టి సత్యనారాయణ, తిరువాయిపాటి అంజనేయలు, బీజేపీ మండల కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి తమ్మా సంజీవరెడ్డి, బీజేపీ అచ్చంపేట మండల పార్టీ అధ్యక్షులు పడకండ్ల లక్ష్మాచారి బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు మోదెల వెంకటేశ్వర్లు, చల్లా అణుపకళ, సూరే చంద్రావతి, అనుమోల ఉషారాణి, స్థానిక భక్తులు, మండల కమిటీ సభ్యులు పాల్గొని శోభాయాత్రని విజయవంతం చేశారు.

ఉక్కు సత్యాగ్రహం సినిమా బస్సు ప్రదర్శన



పట్టణంలో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని జయలక్ష్మీ పిక్చర్ ప్యాలెస్ సినిమా హాల్ నందు ఆదివారం తెలుగు సేన ఆధ్వర్యంలో నిర్మించిన ఉక్కు సత్యాగ్రహం సినిమా బస్సు ప్రదర్శన నిర్వహించారు. సినిమా హీరో సత్యారెడ్డి, గంగమహల్ సుబ్బారావులు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా నిర్వహించే ఉద్యమంలో భాగంగానే ఈ సినిమా నిర్మాణం జరిగిందని తెలియజేశారు. ప్రజాగాయకుడు గద్దర్ నటించిన ఆఖరి చిత్రం ఈ ఉక్కు సత్యాగ్రహం సినిమా అని తెలియజేశారు. పల్నాడు ప్రాంతంలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ సినిమాకు సంబంధించిన బస్సు ప్రదర్శన ఏర్పాటు చేయబడిందని వారు తెలియజేశారు.

ఉక్కు సత్యాగ్రహం ప్రచార కార్యక్రమం

మాచర్ల: పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గానికి చెందిన దర్శక నిర్మాత పులుసు సత్యనారాయణ, స్వర్గీయ గద్దర్ నటించిన విశాఖ ఉక్కు ఆంధ్రా హక్కులో భాగంగా రెండవ విడత మాచర్ల పట్టణంలో ప్రచార యాత్ర ఆదివారం చేపట్టారు. సత్యారెడ్డి అభిమానులు సత్యాగ్రహంతో కూడిన టీషర్టులు, జెండాలు పట్టుకొని ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలంతా ప్రచార యాత్రను ఆసక్తిగా గమనించి స్వర్గీయ గద్దర్‌కు జే జేలు పలుకుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యపై అవగాహన కలిగి ఉండాలి

మాచర్ల: పట్టణంలో జెడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మునగాల చిరంజీవి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పూర్తి స్థాయిలో విద్య, లక్ష్యసాధన, సమయపాలన, స్టడీ స్కిల్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, కార్యదర్శి పందిరి నరసింహారావు, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్, సభ్యులు సత్యనారాయణ, హెచ్‌ఎంలు షకీనా, రామారావు తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 15 కుటుంబాలు



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరిన నీలేశ్వరపాలెం గ్రామస్తులు

అచ్చంపేట(పెదకూరపాడు): పెదకూరపాడు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న సంక్షేమం చూసి అనేక మంది వైఎస్సార్‌సీపీ వైపు అడుగులు వేస్తున్నారు. ఆదివారం అచ్చంపేట మండలం నీలేశ్వరపాలెం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో బాలస్వామి, నరేష్, శ్రీను, అప్పయ్య, అమరయ్య, వీరయ్య, వెంకటేష్, వెంకట్రావు, రోశయ్య, నరసింహారావు, పెద్ద కోటయ్య, శ్రీరాములు తదితరులున్నారు. వారి వెంట అచ్చంపేట, క్రోసూరు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు..

అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామంలో ఆదివారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపించిన శాంతి, ప్రేమ, కరుణ, దయ మార్గం ఈనాటి మానవాళికి ఆదర్శనీయమని, ఆయన బోధనలు ఆచరిస్తే ప్రపంచ శాంతి వర్ధిల్లుతుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శిఖా రాజారావు, పాస్టర్ బాలస్వామిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నంబూరు సెమీ క్రిస్మస్ కేకును కట్ చేశారు. పేదలకు రగ్గులు పంచి పెట్టారు.

వైద్య వృత్తిలో హాస్పిటల్ సిబ్బంది పాత్ర కీలకం



కాంపౌండర్‌లు, నర్సులతో వైద్యులు

ఐఎంఏ ప్రధాన కార్యదర్శి
డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్

సత్తెనపల్లి: వైద్య వృత్తిలో హాస్పిటల్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైనదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని వేద కళాశాలలో సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలల కాంపౌండర్, నర్సుల నూతన కార్యవర్గం సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి గీతా మల్టీ స్పెషాల్టీ వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ గీతా హాసంతి అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వైద్యశాలలో నర్సులు, కాంపౌండర్‌లు చాలా కీలకమన్నారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉండేవారు సిబ్బందేనన్నారు. ఆపదలో వచ్చే రోగులకు ముందుగా స్వాంతన కలిగించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయాలన్నారు. వంశీ స్పెషాలీస్ వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ షకీలా శ్రీధర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది, వైద్యులు అవినాభావ సంబంధం కలిగి ఉండాలన్నారు. రోగుల పట్ల ప్రేమతో ఉండటం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. సత్తెనపల్లిలో నూతనంగా నర్సు, కాంపౌండర్ యూనియన్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. యూనియన్‌కి ఐఎంఏ అండగా ఉంటుందన్నారు. అందరూ సంఘటితంగా ఉండాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షుడిగా ఎం.హనుమంతరావు, అధ్యక్షుడిగా ఎస్ఎం రఫీ, కార్యదర్శిగా సీహెహ్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ వలి, సహాయ కార్యదర్శిగా ఎస్.ప్రసన్నకుమార్, కోశాధికారిగా టి.యేసురంజిత్‌కుమార్, ఎం.లక్ష్మి, లక్ష్మినాగమల్లేశ్వరి, కె.పుల్లారావు, జి.పిచిరెడ్డి, చిన్ననాయక్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఎస్.రాజమోహన్‌రెడ్డి, డాక్టర్ పోట్ల అరుణకుమారి, డాక్టర్ మంత్రూ నాయక్, కాంపౌండర్‌లు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులను కించపరచడం సరికాదు



పరిమి రాంబాబు

ముప్పాళ్ళ: ప్రభుత్వ ఉద్యోగులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరిమి రాంబాబు కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం పక్కన పెట్టి సచివాలయ ఉద్యోగులను కించపరిచే విధంగా మాట్లాడటం ఎంత వరకు సమంజసమన్నారు. వారి హక్కుల కోసం పోరాడటంలో తప్పు లేదు కానీ తోటి ఉద్యోగులపై విమర్శలు చేయటం సరికాదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచి ఎంపికయ్యారనే విషయాన్ని గుర్తించాలన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం కేటాయించిన విధులు నిర్వహించడం ఉద్యోగిగా మా కర్తవ్యమని, ప్రభుత్వం అందించే సేవలన్నీ పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి బాధ్యతలను అప్పగించినా వాటిని సక్రమంగా సకాలంలో అమలుపరుస్తూ ప్రజలకు సేవ చేయడంలో ముందు ఉండి సేవచేస్తున్నామన్నారు. అటువంటి వ్యవస్థను తూలనాడటం సరికాదన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



వెంకటయ్యకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: కష్టంలో కొండంత అండగా బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందజేశారు. క్రోసూరు గ్రామానికి చెందిన బొగ్గవరపు ప్రభావతికి మోకాళ్ల ఆపరేషన్ కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన రూ.1.70 లక్షల చెక్కును స్వయంగా ఇంటికి వెళ్లి అందజేశారు. అదేవిధంగా మండలంలోని 88 త్యాళ్లూరుకు చెందిన అత్తోట వెంకటయ్య చికిత్స కోసం రూ.3.50 లక్షల చెక్కును ఇంటి వద్దే అందజేశారు. కష్టంలో అండగా నిలిచి సాయం అందించిన ఎమ్మెల్యే శంకరరావుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 88త్యాళ్లూరు నుంచి అప్పారావు, రవి, శ్రీనివాసరావు, దానయ్య, శ్రీనివాసరావు, క్రోసూరు నుంచి ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగపూర్ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అప్పారావు, యు.రవీంద్రబాబు, అప్పిరెడ్డి పాల్గొన్నారు.